క్లుప్తంగా

ముమ్మిడివరం సీఐగా కొండయ్య



బాధ్యతలు స్వీకరించిన కొండయ్య

ముమ్మిడివరం: స్థానిక ముమ్మిడివరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.కొండయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పని చేసిన ఎం.జానకీరామ్ రిక్వెస్ట్‌పై వీఆర్‌కు వెళ్లారు. కొండయ్య ఏలూరు నుంచి బదిలీపై ముమ్మిడివరం వచ్చారు. గతంలో ముమ్మిడివరం స్టేషన్‌లో ఎస్సైగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన కొండయ్యను ఎస్సై కె.సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది అభినందించారు.

కల్వర్టు నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు

అల్లవరం: గోడితిప్ప గ్రామంలో మారెమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణానికి ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.12 లక్షలు మంజూరైనట్టు వైస్ ఎంపీపీ వడ్డి గంగ సోమవారం తెలిపారు. నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను సోమవారం ఆమె పరిశీలించారు.ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని కల్వర్టుకి నిధులు మంజూరు చేసి పనులను పూర్తి చేయించడంలో శ్రద్ధ చూపిన ఎంపీ అనురాధకు గోడితిప్ప గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొప్పాడి వెర్రియ్య, పార్టీ నాయకులు, బసవా ఆనంద్, మేడిద కృష్ణ, మేడిద శ్రీను తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

13న రక్తదాన శిబిరం

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక దళిత నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నిర్వహించే రక్తదాన శిబిరం కరపత్రాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, ఎస్సీ, ఎస్టీ వైస్ ప్రెసిడెంట్ లోకేశ్వరరావు, విశ్వజనా కళామండలి జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, శ్యామ్‌రాజ్ మాట్లాడుతూ ఆ రోజు యానాం ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తారని, దాన్ని ఎమ్మెల్యే అశోక్ ప్రారంభిస్తారని తెలిపారు.

క్రికెట్ టీమ్‌కు భట్లపాలెం విద్యార్థి ఎంపిక



మురళి

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్న తిరుమనాథం మురళి రాష్ట్ర అండర్–19 క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యాడు. సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ జేవీసీ రామారావు ఏవో జక్కం కృష్ణారావు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బండారు ఫణి, పీడీ రవణం మాధవి అభినందించారు.

12న కోస్టల్ జోన్ ప్లాన్‌పై సమావేశం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ నాలుగు రీజియన్లలో 2019 సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు కొత్తగా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్(సీజెడ్‌ఎంపీ)ను తయారు చేస్తున్న నేపథ్యంలో ఈనెల 12న పుదుచ్చేరి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆర్‌ఏఓ మునిస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్ మున్సిపల్ కల్యాణ మండపంలో ఆరోజు ఉదయం 10 గంటల నుంచి పుదుచ్చేరి కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

అంబేడ్కర్ సంపుటాలను తెలుగులో ముద్రించాలి

తాళ్లరేవు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన సంపుటాలను తెలుగులో ముద్రించాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 1995, 96 మధ్యకాలంలో అంబేడ్కర్ రచనలలో కొన్ని సంపుటాలను తెలుగులో ముద్రించారని, కానీ అవి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో లేవన్నారు. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని తెలుగులో ముద్రించాలని ఏడుకొండలు కోరారు.

తాళ్లరేవులో టీడీపీ ధర్నా

తాళ్లరేవు: పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ మండల టీడీపీ నాయకులు సోమవారం ధర్నా చేశారు. స్థానిక సబ్‌స్టేషన్ వద్ద పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, టి.లక్ష్మణరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ జాతర

అయినవిల్లి: గ్రామ దేవతగా పూజలందుకుంటున్న రావులమ్మవారికి సోమవారం రాత్రి జాతర మహోత్సవాలు జరిపారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. చిత్ర విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రకృతి ఒడిలో ఒదిగేలా..



కోరంగి అభయారణ్యం వద్ద పర్యాటకుల సందడి

- వేసవి విడిదిగా కోరంగి అభయారణ్యం
- పర్యాటకులను ఆకర్షిస్తున్న మడ అటవీ అందాలు
- చల్లటి గాలుల నడుమ బోటు షికార్
- చిన్నారుల ఆటా పాటా కోసం ప్రత్యేక ఏర్పాట్లు

తాళ్లరేవు: వేసవి వచ్చేసింది. విద్యార్థులకు సెలవులు ఇచ్చేశారు. పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. అలాంటి వారిని రారా రమ్మంటు ఆహ్వానిస్తోంది కోరంగి అభయారణ్యం. అటు ఆనందం, ఇటు ఆహ్లాదం అ అడవుల సొంతం. వేసవిలో కూల్ కూల్‌గా ఉంటుంది. ప్రకృతి ఒడిలో చిన్నా పెద్దా అంతా ఆనందంగా గడిపేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. ఏటా వేలాది మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ముఖ్యంగా మడ అడవుల్లో చెక్క వంతెనలపై నడుస్తూ, పక్షుల కిలకిలా రావాలు, మడ చెట్ల సౌందర్యం, జంతువుల విన్యాసాలను తిలకిస్తుంటారు. వాచ్ టవర్, బోట్లపై నుంచి మడ అడవుల అందాలు, సముద్రాన్ని చూసి మంత్రముగ్ధులవుతారు. అలాగే అభయారణ్యంలో ప్రశాంత వాతావరణంలో సేదతీరి కబుర్లు చెప్పుకుంటూ గడపడం మరపురాని అనుభూతిగా భావిస్తుంటారు. ఈ మేరకు పర్యటకుల సౌకర్యార్థం తాగునీరు, తినుబండారాల దుకాణాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది.

అలరించనున్న బోటు షికార్

అభయారణ్యంలో పర్యాటకులకు బోటు షికార్ ప్రత్యేకంగా అలరిస్తుంది. ఏపీ టూరిజం, అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. బోటుపై నుంచి కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. అలాగే మడ చెట్లపై సంచరించే వివిధ రకాలు పక్షులు, ప్రకృతి దృశ్యాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. వేసవిలో బోటు షికారు చేయడమంటే ఆనంద డోలికల్లో మునిగి తేలడమే అంటారు పర్యాటకులు. భానుడు ఎంత ప్రతాపం చూపుతున్నా నదిలో బోటు షికారు చేస్తుంటే మడ అడవుల కారణంగా చల్లని గాలి వీస్తూ మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. దీంతో అధిక శాతం మంది పర్యాటకులు బోటు షికారు చేసేందుకు ఆసక్తి చూపుతారు.



మడ అడవుల అందాలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్



కోరంగి అభయారణ్యంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



మడ అడవుల అందాలను స్వయంగా వీక్షించేందుకు ఏర్పాటు చేసిన చెక్కల వంతెన

పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



అభయారణ్యాన్ని సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ప్లాస్టిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా పాలిథిన్ కవర్లతో ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను అభయారణ్యంలోనికి అనుమతించడం లేదు. ప్రధానంగా పర్యాటకుల కోసం తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. అభయారణ్యంలో పలు చోట్ల రిఫ్రిజిరేటర్లను ఏర్పాటు చేసి చల్లటి పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అల్పాహార పదార్థాలు అడవుల్లోనే అందుబాటులో ఉంచుతున్నాం. చిన్నారుల ఆటా పాటల కోసం ఇప్పటికే పలు ఏర్పాట్లు చేశాం.

–ఎం.నాగార్జున, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, కోరంగి అభయారణ్యం

నవోదయ పరీక్షపై అవగాహన



నవోయదయ ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పిస్తున్న నవోదయ టీచర్లు

యానాం: అఖిల భారత స్థాయిలో ఈ నెల 29న నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక డాక్టర్ జకీర్‌హుస్సేన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, యానాం, అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, దరియాలతిప్ప కనకాలపేటలోని కోన వెంకట్రావు ప్రభుత్వ పాఠశాలల్లో సదస్సులు జరిగాయి. ఉపాధ్యాయులు లక్ష్మణరావు, రమేష్‌ల పర్యవేక్షణలో జరిగిన సదస్సులో విద్యార్థులు పరీక్ష రాసే విధానం, పూర్తి చేయాల్సిన అంశాలు, హాల్ టిక్కెట్ తీసుకోవడం తదితర అంశాల గురించి పూర్తి స్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు.

మావూరి కుటుంబ సభ్యుల వితరణ



విద్యా సహాయనిధికి విరాళం అందిస్తున్న మావూరి వారి కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: బండారులంక మాడావారి వీధికి చెందిన మావూరి శ్రవణమ్మ, సుబ్బారావు జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం విద్యా సహాయ నిధికి రూ.లక్ష, గ్రామ శ్మశాన అభివృద్ధి కమిటీకి రూ.25 వేలు, మురుగులమ్మ ఆలయాభివృద్ధికి రూ.25వేలు, కాశీలోని దేవాంగ అన్నదాన సత్రానికి రూ.27వేలు విరాళం అందించారు. ఈ విరాళాలను బండారులంకలో కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి, ఆయా ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బళ్ల స్వామి వివేకానంద, చింతా శంకరమూర్తి, పుత్సల వరదరాజు, బళ్ల బాలభాస్కరరావు, పిచ్చిక శ్యామ్, లక్కింశెట్టి సోమనాథం, వాసా దొరబాబు, మావూరి సుబ్బారావు, బళ్ల సత్య సాయిబాబు, కాలెపు భీమేశ్వర సిద్ధాంతి, చింతపట్ల గంగా సత్యనారాయణ, కొండా శ్రీను, కాశిన వీరభద్రరావు, చందన శంకరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి కృషి



విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌ఏఓ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు సెన్నంశెట్టి సాయివిరాట్, సంగాడి యేసురాజులకు నగదు బహుమతి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాసరావు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, సిబ్బంది తాతారావు, నూకరత్నం, విజయలక్ష్మి, టీచర్ వీరవేణి, షరీఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈఓ

కాట్రేనికోన: కాట్రేనికోన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న సమయంలో విద్యార్థులు అల్లరి చేస్తున్నారని గుర్తించి ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలిగించినట్టు డీఈఓ తెలిపారు.

బ్రహ్మార్పణ్ పథకానికి వంద రోజులు

లయన్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ఆస్పత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ పోతురాజు, లయన్స్ ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ నిరుపేద భోజన క్యారేజీ పథకం ప్రారంభించి సోమవారం నాటికి వంద రోజులు పూర్తయినట్టు క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వందో రోజున డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు తనయుడు అభిరామ్ పుట్టినరోజు సందర్భంగా అభాగ్యులకు భోజనం క్యారేజీలు, పండ్లు అందజేశారు. అదేవిధంగా స్థానిక సామాజిక ఆస్పత్రిలోని బాలింతలకు పండ్లు, రొట్టెలు అందించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భోజన క్యారేజి పథకం ద్వారా ప్రతిరోజు ఆదరణ లేని అభాగ్యులకు వారి ఇంటి వద్దకే క్యారేజి పంపిస్తున్నామన్నారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, క్లబ్ కార్యదర్శి భగవాన్, దత్తు, సతీష్‌రాజు, ధూళిపూడి వెంకటరమణ, కొప్పిశెట్టి బాబి, శ్రీధర్, ఆదినారాయణ, రాయపరాజు, కాశీరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



అరటికాయలంక పంపుహౌస్ వద్ద ఇంజినీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గానికి ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. సోమవారం యానాం సరిహద్దులోని ఫ్రెంచి కెనాల్ నుంచి నీటిని తోడే అరటికాయలంక వద్ద నున్న పంపు హౌస్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్రెంచి కెనాల్ నుంచి ప్రస్తుతం వస్తున్న నీరు, అదేవిధంగా ఎన్ని క్యూసెక్కుల నీటిని తీసుకురావాలి అనే విషయాలపై స్థానిక పీడబ్ల్యూడీ అధికారులతో చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోను వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



ముమ్మిడివరంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు బోస్, ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ప్రతి ఇంటిలో లబ్ధిదారులు మానమ్మకం నువ్వే జగనన్న అంటూ స్టిక్కర్లను అతికిస్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 14, 15 వార్డుల్లో సోమవారం నిర్వహించిన జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యుడు పిల్లి సుబాస్ చంద్రబోస్, ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వ పాలనకు ప్రస్తుత జగనన్న పాలనకు ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని అందుకే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా పైసా అవినీతికి తావు లేకుండా కుల, మత, పార్టీలు, చూడకుండా నేరుగా ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు చేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని కొనియాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కౌన్సిలర్లు సరిపెల్ల రామకృష్ణంరాజు, వేటుకూరిబోసురాజు, రాయాయణం శ్రీరామారావు, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్,కోలా బాబ్జీ, జగతా పద్మనాభం, రెడ్డి శివన్నారాయణ, వాసంశెట్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాలపై ఆరా

అమలాపురం టౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం అమలాపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో సోమవారం జోరుగా సాగుతోంది. స్థానిక 16వ వార్డులో కౌన్సిలర్, సచివాయల కన్వీనర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర ఆధ్వర్యంలో గృహ సారథులు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ తరలివెళ్లి ప్రజా మద్దతు పుస్తకం నుంచి అయిదు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. 27వ వార్డులో కౌన్సిలర్ బండారు గోవిందు, 12వ వార్డులో కౌన్సిలర్ కట్టోజు సన్న్యయ్యదాసు, 17వ వార్డులో కౌన్సిలర్ దొమ్మేటి రాము ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.


తాళ్లరేవు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. సోమవారం తాళ్లరేవు సచివాలయం–1లో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాలనపై పలు ప్రశ్నలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల వద్ద మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను అతికించారు. అదేవిధంగా నీలపల్లి, జార్జీపేట, ఇంజరం, పి.మల్లవరం, కోరంగి, పటవల తదితర పంచాయతీలో ఉత్సాహంగా నిర్వహించారు.

అమలాపురం రూరల్: పేరూరు పంచాయతీ పరిధిలో కొంకాపల్లిలో సర్పంచ్ దాసరి అరుణ, రూరల్ వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సుదా గణపతి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో జనసేన ఎంపీటీసీ బాలమ్మ

ఉప్పలగుప్తం: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావుతో కలసి గొల్లవిల్లి జనసేన ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ పాల్గొన్నారు. సీఎం జగన్ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆదివారం గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్‌లు, గృహసారథులు సచివాలయ కన్వీనర్లు పాల్గొని సీఎం జగన్ చేస్తున్న పనుల గురించి వివరించారు. యర్రంశెట్టి రామచంద్రరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, కన్వీనర్లు పాల్గొన్నారు.


అల్లవరం: రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల్లో సుపరిపాలన జరగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో మారు వైఎస్ జగన్ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గోడి, ఎంట్రుకోన గ్రామాల్లో జగనన్నేతో మా భవిష్యత్ కార్యాక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బోడసకుర్రు, అల్లవరం, ఎంట్రుకోన, కొమరగిరిపట్నం, గోడి, తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహసారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, తిక్కిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ కుంచే చిన సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ బోసు, పాటి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం 16వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, గృహసారథులు



తాళ్లరేవులో పర్యటిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు



ఎంట్రుకోనలో జగనన్నే మా భవిష్యత్ అంటూ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

ఇంటింటా సంక్షేమం

ముమ్మిడివరం: అర్హతే ప్రామాణికంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం నగర పంచాయతీ 14, 15 వార్డులలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందితున్న సంక్షేమ పథకాల బ్రోచర్‌ను చదివి వినిపించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి వప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజు, కౌన్సిలర్లు, వార్డు సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాడి పరామర్శ



పాస్టర్ కుటుంబాన్ని పరామర్శించిన మల్లాడి

యానాం: పట్టణ పరిధిలోని కురసాంపేటలో ఇండియన్ పెంతికొస్తు చర్చి పాస్టర్ శామ్యూల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సోమవారం పాస్టర్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. శామ్యూల్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

నిరుపేదలకు తోడుగా సత్యసాయి సేవా సంస్థ

మామిడికుదురు: శ్రీసత్యసాయి సేవా సంస్థ నిరుపేదలకు తోడుగా నిలుస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పేర్కొన్నారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో గోదావరి వరద బాధితుల కోసం నిర్మించిన గృహాలను లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. పెదపట్నంలంకలో రెండు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో మూడు గృహాలను సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఒక్కో గృహం నిర్మాణానికి రూ.రెండు లక్షలు ఖర్చు చేశామన్నారు. సేవా సంస్థ ద్వారా ఇంత వరకు వరద బాధితులకు నిత్యావసరాలు, భోజనాలు అందించడం, కూరగాయలు, దుప్పట్లు, రగ్గుల పంపిణీ చేశామన్నారు. ఇళ్ల నిర్మాణం ద్వారా కొత్త ఒరవడి సృష్టించామని లక్ష్మణరావు పేర్కొన్నారు. ముందుగా పెదపట్నంలంకలో ప్రశాంత పతకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు నిత్యావసరాలు, దుస్తులు, వంట పాత్రలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు వై.గోవిందరాజు, సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, కొనుకు ప్రేమజ్యోతి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల బాబులు, తోరం సూర్యభాస్కర్, సేవా సంస్థ ప్రతినిధులు ఎంపీ వర్ధనరావు, కాశిన ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతు బజార్‌తో అందరికీ మేలు

ఆలమూరు: రైతు బజార్ ఏర్పాటుతో కూరగాయల రైతులకు లాభసాటిగాను, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు లభించడంలోనూ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని బస్టాండు సెంటర్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ తమ్మన సుబ్బలక్ష్మి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యాన సుమారు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సమయంలోనే కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు గ్రామాల్లో రైతుబజార్లు ఏర్పాటు చేసి కూరగాయల రైతులకు ప్రయోజనం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన పది కూరగాయల దుకాణాలను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే స్థానిక యర్ర కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక ఏఎంసీ పర్యవేక్షణలో నిర్వహించే ఈ రైతు బజార్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, ఉప సర్పంచ్ తోరాటి సీతా మహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు రావాడ సత్తిబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, ఏఎంసీ కార్యదర్శి గెద్దాడ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి పీఠాధిపతి పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం నైమిశారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బాలబ్రహ్మానంద సరస్వతి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు ఆలయంలో అసిస్టెంట్ వి.సత్యనారాయణ దేవస్థానం తరపున సత్కారం చేశారు. భక్తులకు పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి నారసింహ యోగ ప్రవచనం చేశారు.